

ఎస్ఆర్‌పురంలో పాలీహోస్ !

- రూ.500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఫ్యాక్టరీ
- ఎమ్మెల్యే థామస్ చొరవతో 2వేలమందికి ఉపాధి



శ్రీరంగరాజపురంలో గురువారం భూసేకరణపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

చిత్తూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):ఆటో మొబైల్ ఇండస్ట్రీకి అవసరమైన థర్మోప్లాస్టిక్,స్టీల్ గొట్టాల తయారీలో పేరెన్నిక గన్న పాలీహోస్ కంపెనీ ఎస్ఆర్‌పురం మండలంలో రూ.500కోట్ల పెట్టుబడితో భారీ యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది.ఇందుకుఅవసరమైన భూమిని సేకరించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసేందుకు ఎమ్మెల్యే థామస్ కృషి చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి పాలిహోస్ యాజమాన్యంతో చర్చలు జరిపి నియోజకవర్గానికి వచ్చేందుకు ఒప్పించారు.అయితే ఇండస్ట్రీ ఏర్పాటు చేసేందుకు చిత్తూరు- తచ్చూరు ఎక్స్‌ప్రెస్ వే సమీపంలో 500 ఎకరాలు కావాలని అడిగారు. ఎస్ఆర్‌పురం మండలంలోని 56.కన్నికాపురం, పాతపాళ్యం, జీఎంఆర్ పురం రెవెన్యూ గ్రామాల పరిధిలో 500 ఎకరాల్ని కేటాయించేందుకు ఎమ్మెల్యే థామస్ ప్రయత్నిస్తున్నారు.ఇటీవల కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా ఎస్ఆర్‌పురం మండలంలో పర్యటించి, కేటాయించనున్న భూమిని పరిశీలించారు. ప్రస్తుతానికి సుమారు 250- 300 ఎకరాలు కేటాయించేందుకు కలెక్టర్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ భూమిలో సుమారు 50-60 మంది రైతులుండడంతో, వారిని భూసేకరణకు ఒప్పించాల్సివుంది.తొలి విడతలో రూ.500 కోట్లతో ఇండస్ట్రీని ఏర్పాటు చేసి, విడతల వారీగా మరో రూ.వెయ్యి కోట్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు పాలిహోస్ కంపెనీ సిద్ధమైనట్లు ఎమ్మెల్యే థామస్ తెలిపారు. ఇక్కడ ఇండస్ట్రీ ప్రారంభమైతే సుమారు 2 వేల మందికి ఉపాధి లభించనుందని వివరించారు.







పాలీహోస్ కంపెనీ ఉత్పత్తులు

పాలీహోస్‌తో పాటు మరిన్ని పరిశ్రమలు

గంగాధర నెల్లూరు నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చా. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళుతున్న యువతకు ఇక్కడే ఉపాధి కల్పించేలా కృషి చేస్తున్నా.పాలీహోస్ రావడంతో తొలి అడుగు పడింది. జీడీనెల్లూరులో బయో సీఎన్‌జీ ప్లాంటు, కార్వేటినగరంలో క్లాసిక్ టూల్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తో పాటు ఐటీ కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించాం.ఈ రెండింటికీ భూమి కూడా గుర్తించాం. భారత్ బయోటెక్ కంపెనీతో సంప్రదింపులు చేస్తున్నాం.

- థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

300 ఎకరాల భూసేకరణకు ప్రయత్నం

తమిళనాడులో పాలీహోస్ ఇండస్ట్రీకి పెద్ద యూనిట్లు ఉన్నాయి. వేలకోట్ల రూపాయల టర్నోవర్ ఉంది. అలాంటి కంపెనీ జీడీనెల్లూరు యూనిట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. 500 ఎకరాలు కావాలని అడిగారు. 250-300 ఎకరాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. రైతులతో మాట్లాడి ఒప్పించి భూసేకరణ చేయనున్నాం.

- సుమిత్‌కుమార్, కలెక్టర్

శోభాయమానం.... తిరుమల క్షేత్రం



తిరుమల, , సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలతో తిరుమల కొండ శోభాయమానంగా దర్శనమిస్తోంది. రూ.5.50 కోట్లతో విద్యుద్దీపాలంకరణ చేపట్టంతో నూతన అందాలతో స్వామి క్షేత్రం కనువిందు చేస్తోంది. శ్రీవారి గర్భాలయం నుంచి మహాద్వారం వరకు, ప్రాకారం, గోపురం, మాడవీధుల్లోని ముఖ్యమైన భవనాలకు రంగురంగు లైట్లతో విద్యుత్ అలంకరణలు చేశారు. ప్రధాన కూడళ్లలోనూ విద్యుత్ తీగలతో పాటు వివిధ దేవతామూర్తుల భారీ కటౌట్లు, లైట్లతో కూడిన ప్లాస్టిక్ చెట్లు, సప్తద్వారాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను నూతన ఎస్పీ తుషార్ డూడి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు ఓ మొక్కను అందించారు.

27 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో శనివారం కూడా జిల్లావ్యాప్తంగా జడివాన కొనసాగింది. అత్యధికంగా పులిచెర్లలో 50.2, అత్యల్పంగా బైరెడ్డిపల్లిలో 2.8 మిమీ వర్షం కురిసింది. వెదురుకుప్పంలో 37.2, పెద్దపంజాణిలో 36, పుంగనూరులో 34.2, పెనుమూరులో 30, గుడిపాలలో 21.8, బంగారుపాళ్యంలో 20, వి.కోటలో 19.6, రొంపిచెర్ల, శ్రీరంగరాజపురం మండలాల్లో 15.4, పూతలపట్టులో 10.6, గంగవరం, కార్వేటినగరం, విజయపురం మండలాల్లో 10.2, తవణంపల్లెలో 10, నింద్ర, యాదమరి మండలాల్లో 9.4, ఐరాలలో 9.2, సోమలలో 8.6, సదుంలో 8.2, చిత్తూరు రూరల్‌లో 7.6, గంగాధర నెల్లూరులో 7, పలమనేరులో 6.2, పాలసముద్రంలో 5.6, చిత్తూరు అర్బన్‌లో 5, నగరిలో 3.8 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

కైగల్‌లో ఉధృతంగా నీటిప్రవాహం



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైగల్ జలపాతంలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.కర్ణాటకలో వర్షాలు పడడంతో పాటు కైగల్‌కు అనుసంధానంగా ఉన్న చెరువులు నిండిపోయి మొరవ పోతుండడంతో ఆ నీరంతా కైగల్ జలపాతంలోకి ప్రవేశించి బండరాళ్లమధ్య ప్రవహిస్తోంది.

అసంతృప్తిలో 40శాతం విద్యుత్ వినియోగదారులు

- అధికారులపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ ఆగ్రహం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లాలో 40 శాతం విద్యుత్ వినియోగదారులు అసంతృప్తిలో ఉన్నారని తేలిందని అధికారులపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక గిరింపేటలోని ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ, ఈఈలతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో విద్యుత్ సేవలను మెరుగుపరచాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వర్షకాలం కావడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మునిచంద్ర, జగదీష్, సురేష్, అమర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో 'ఆక్టోపస్' మాక్ డ్రిల్



ఆలయం వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం ఆలయం వద్ద ఆక్టోపస్ సిబ్బంది శుక్రవారం అర్ధరాత్రి తర్వాత మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పెంచలకిషోర్, ఏఎస్పీ నందకిషోర్, ఆక్టోపస్ డీఎస్పీ తిరుమలయ్య మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల కారణంగా ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్నారు. ఆలయం వద్ద ఏదైనా దాడి జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి, యాత్రికులను ఏవిధంగా కాపాడాలన్న దానిపై మాక్‌డ్రిల్ నిర్వహించామన్నారు. ఆలయ పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు, ఆలయ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిత్యం పోలీసులు, హోంగార్డులు ఆలయాన్ని, భక్తులను కాపాడేందుకు కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు, తహసీల్దార్ లోకేశ్వరి, డాక్టర్ రాజేశ్వరి, ఏఈవో రవీంద్రబాబు, ఏఈలు శివాంజనేయులు, పవన్, ఎస్ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి' సక్సెస్

నెల రోజుల్లో 22.22 లక్షలమంది ఉచిత ప్రయాణం



కాణిపాకం బస్సెక్కుతున్న మహిళలు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకంతో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. జిల్లాలోని 5 డిపోల్లో 461 బస్సులున్నాయి.వీటిలో 316 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చేసే అవకాశముంది.ఈ బస్సుల్లో దాదాపు 60 శాతం మంది మహిళలే ప్రయాణిస్తున్నారు.స్త్రీశక్తి ఆవిర్భావానికి పూర్వం చిత్తూరు జిల్లాలో సాధారణ రోజుల్లో 1.31 లక్షల మంది ప్రయాణించేవారు. ఇప్పుడు అదనంగా 20 శాతం మంది అంటే మరో 32వేల మంది అదనంగా రాకపోకలు సాగిస్తున్నారు.రోజూ 708 గ్రామాలకు సుమారు 164 రూట్లలో ఆర్టీసీ బస్సులు తిరుగుతుండగా ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చాక నెల రోజుల్లో 22,22,676మంది మహిళలు స్త్రీ శక్తి పథకాన్ని వినియోగించుకున్నారు.వారికి 9,06,52,339రూపాయలు ఆదా అయ్యాయి.

బస్సుల సంఖ్య పెరగాలి

స్త్రీశక్తి పథకం ప్రారంభమయ్యాక మహిళా ప్రయాణికులు పెరగడంతో బెంగుళూరు,తిరుపతి, కుప్పం రూట్లలో రద్దీ అధికంగా ఉంటోంది. అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి లేకపోవడంతో తిరుపతి నుంచి బెంగళూరుకు వెళ్లాల్సిన మహిళలు ముందుగా ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా చిత్తూరుకు చేరుకుంటున్నారని,అక్కడి నుంచి బెంగళూరు బస్సులు ఎక్కుతుండడంతో బెంగుళూరు బస్టాండ్ రద్దీగా మారుతోందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.చిత్తూరు నుంచి బెంగళూరుకు ప్రయాణించే మహిళలు కూడా కుప్పం, పలమనేరు బస్సుల్లో పలమనేరు వరకు ప్రయాణించి అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్తున్నారని, ఇలా ప్రయాణించడం ద్వారా రూ.160 ఆదా చేస్తున్నారని చెబుతున్నారు.జిల్లాకు రావాల్సిన కొత్త బస్సులు వస్తే రద్దీ సమస్య పరిష్కారమవుతుందని డీపీటీవో రాము తెలిపారు.

డిపో	ప్రయాణించిన మహిళలు
చిత్తూరు-1	471032
చిత్తూరు-2	504922
కుప్పం	319803
పలమనేరు	472105
పుంగనూరు	454814
మొత్తం	22,22,676

ఇంట్లో దొంగల బీభత్సం

కత్తులతో బెదిరించి దోపిడీ

100 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.70వేల అపహరణ

చంద్రగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కాశిపెంట్లలో శుక్రవారం రాత్రి దొంగలు బీభత్సం చేశారు. కత్తుల బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ఓ ఇంట్లో గల్లా నాగేశ్వరనాయుడు, భార్య సుశీల, ఆయన తల్లి ద్రౌపది ఉన్నారు. వీరి కుమారుడు ప్రశాంత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9గంటలకు నాగేశ్వరనాయుడు దంపతులు తమ కుమారుడితో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల కారులో ఇంటి ముందుకు వచ్చారు. గేటు ముందు హారన్ కొడుతుండటంతో సుశీలమ్మ వెళ్లి తలుపు తీసేందుకు ప్రయత్నిస్తుండగానే ఇంటి వెనుకవైపునుంచి ముఖానికి మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు లోనికి ప్రవేశించారు. ద్రౌపది చేతులు తువ్వాలు కట్టేసి, నాగేశ్వరనాయుడు, సుశీలమ్మలకు కత్తులు చూపించి బెదిరించారు. కప్‌బోర్డులో ఉన్న రూ.70 వేల నగదు, వంద గ్రాములు బంగారు ఆభరణాలు తీసుకున్నారు. ఫోన్లో మాట్లాడుతున్న కుమారుడు ప్రశాంత్ ఇక్కడి అలజడిని గమనించాడు. దొంగలు పడ్డారని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వెంటనే గ్రామంలో తెలిసిన కొందరికి ఫోన్ చేశాడు. గ్రామస్థులు చేరుకుని కేకలు వేస్తూ రావడంతో దొంగలు కారులో పరారయ్యారు. గ్రామస్తులు 100కి ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే హైవే మొబైల్ సిబ్బంది చేరుకుని దుండగులు కోసం గాలించారు. క్లూస్ టీమ్ వేలి ముద్రలు సేకరించింది. బాధితుడు నాగేశ్వరనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



'ఓజీ' పెద్ద హిట్ కావాలి

● నిర్మాత డీవీవీ దానయ్య

ఈనెల 25న విడుదల కానున్న పవన్‌కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా పెద్ద హిట్ కావాలని శ్రీవేంకటేశ్వరస్వామిని కోరానని ఆ చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కాగా శనివారం శ్రీవారిని ఉడిపిలోని పాలిమారు మఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామిజీ, ఢిల్లీ ఏపీ ప్రభుత్వ సలహాదారు ఆర్పీ ఠాకూర్ దర్శించుకున్నారు.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.04 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,249

తలనీలాలు సమర్పించినవారు: 22,901




- బ్రాండెడ్ షాపులోనూ నాణ్యత లేని మందులే
- తనిఖీల్లో వెల్లడైనా చర్యలు తీసుకోని టీటీడీ
- వైసీపీ హయాంలో మొదలై నేటికీ కొనసాగుతున్న అక్రమాలు

ఈ రోగానికి మందేది?

● స్విమ్స్ జనరిక్ షాపులో బ్రాండెడ్ మందులు



తిరుపతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆవరణలో మందుల మాయాజాలం నడుస్తోంది. బ్రాండెడ్ మందులు మాత్రమే విక్రయించాల్సిన షాపులో జనరిక్ మందులు, జన ఔషధి షాపులో బ్రాండెడ్ కంపెనీల మందుల విక్రయం జరుగుతోంది. ప్రిస్క్రిప్షన్‌లో రాసిన మందులకు బదులు నాసిరకం అంటగడుతున్నారు. వైద్య బృందాల తనిఖీలో మందుల బాగోతం తేలినా టీటీడీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వంలో కీలక నేతల మద్దతుతో మొదలైన మందుల షాపుల అక్రమాలు ప్రభుత్వం మారినా కొనసాగుతుండడం విమర్శలకు దారితీస్తోంది.



స్విమ్స్‌లో ఇన్నోవేటివ్ ఫార్మా మందుల షాపులో క్వాలిటీ చెక్,రీ చెక్ చేసినా తప్పిదాలు సరిదిద్దుకోలేదని వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక

ఇన్నోవేటివ్‌గా దోపిడీ!

స్విమ్స్ ఆవరణలో గతేడాది డిసెంబరులో ఇన్నోవేటివ్ ఫార్మాసూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఓ మందుల షాపు వెలిసింది. కేటగిరీ పరంగా ఇందులో బ్రాండెడ్ కంపెనీల మందులు విక్రయించాలి. ఈ షాపు నెలవారీ అద్దె రూ.31 లక్షలంటే వ్యాపార స్థాయి ఊహించవచ్చు. అధిక ఖరీదు కలిగిన మందులు విక్రయిస్తున్నా చాలా మటుకు నాసిరకమనే ఆరోపణలున్నాయి. ఈనెల 6వ తేదీన బక్కయ్య(64) అనే రోగికి వైద్యులు నాలుగు రకాల మందులు రాశారు. అందులో ఎకోస్ప్రిన్ మాత్రల బదులు నాణ్యత లేని ఎకోఫ్రిల్ విక్రయించారు. స్ట్రోక్ వస్తే మెదడులో రక్తం గడ్డ కట్టకుండా ఉండడానికి ఈ మాత్ర ఉపకరిస్తుంది. నాసిరకం మాత్రల వల్ల అనర్థం సంభవించే ప్రమాదముంది. ముపిరోసిన్ అనే ఆయింట్‌మెంట్ బదులు టి.మ్యూస్ క్రీమ్ అనే నాసిరకం విక్రయించారు. స్టిలోజ్ ట్యాబ్‌లెట్ రాస్తే నాణ్యత లేని సిలోబాక్ట్ ఇచ్చారు. ట్రీటిల్ మాత్ర బదులు పెరిటాల్ అనే నాసిరకం మాత్ర ఇచ్చారు. గుండె, కిడ్నీ సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్న కె.జయమ్మకు కూడా వైద్యులు రాసిన నాణ్యమైన మందులకు బదులు నాణ్యతలేని మందులు ఇచ్చారు. దీంతో ఆరోగ్యం క్షీణించి ఆమె ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. వైద్యుల ద్వారా నిర్ధారించుకున్న జయమ్మ కుటుంబీకులు గత నెల 22న స్విమ్స్‌కు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఈ షాపుపై అనేక ఫిర్యాదులు వచ్చాయి.

రెండవ తనిఖీలోనూ అవే తప్పిదాలు

వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినా ఈ షాపుపై ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.దీంతో రెండోసారి అంటే మే 9న వైద్యుల బృందం మళ్లీ తనిఖీ చేసింది.మునుపు గుర్తించిన తప్పిదాలను సరిదిద్దుకోలేదని తేల్చింది. అదనంగా మరిన్ని ఉల్లంఘనలు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చింది.. అయినా ఈ దుకాణంపై చర్యలు తీసుకోలేదు.



స్విమ్స్ జన ఔషధి షాపులో తనిఖీలు చేపట్టి అక్రమాలపై వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక

5 శాతమే జనరిక్ మందులు

స్విమ్స్ ఆవరణలో ఓపీడీ బ్లాకు వద్ద వెలుపల బర్డ్ భవనంలో పీఎంబీజేకే పథకం కింద ఈ ఏడాది జూన్‌లో జన ఔషధి షాపు ఏర్పాటైంది. దీని నెలవారీ అద్దె రూ.5 లక్షలు. ఇందులో 90 శాతం జనరిక్ మందులు ఉండాలి. తక్కువ ధరలకు విక్రయించాలి. అయితే బ్రాండెడ్ పేరిట నాసిరకం మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తుండడంతో గత నెల 23న ఏడుగురు సీనియర్ వైద్యుల బృందం తనిఖీ చేసింది. జనరిక్ మందులు 5 శాతం మాత్రమే ఉన్నాయని గుర్తించింది. ధరలు కూడా జన ఔషధి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్నట్టు తేలింది.

వైసీపీ హయాంలోనే అక్రమాలకు బీజం

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే టీటీడీలో అప్పటి కీలక వ్యక్తి సిఫారసుతో స్విమ్స్ ఓపీడీ బ్లాకులో రోగుల వెయిటింగ్ హాలును మందుల షాపుగా మార్చేశారు. అక్కడ పీఎంబీజీకే పథకం జన ఔషధి షాపు పెట్టారు. నెలవారీ అద్దె కేవలం రూ.20 వేలుగా నిర్ణయించారు. అక్కడ రోజువారీ వ్యాపారం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల దాకా జరిగేది. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ బ్రాండ్లుగా కంపెనీల పేర్లు చూపి అధిక ధరలకు నాసిరకం మందులు విక్రయించారన్న ఫిర్యాదులు వచ్చాయి. అయినా చర్యలు తీసుకోకపోగా ఏటా పది శాతం అద్దె పెంపుతో ఐదేళ్లు షాపును కొనసాగించారు. 2023 ఆగస్టులో సంబంధిత టీటీడీ కీలక వ్యక్తి పదవి నుంచి తప్పుకోబోయే ముందు ఈ షాప లైసెన్స్ గడువును 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి 31వరకు ఏకంగా మూడేళ్ల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది డిసెంబరులో ఈ షాపు మూతపడింది. వైసీపీ కీలక నేత సిఫారసుతో ఈ షాపును బినామీ పేరుతో దక్కించుకున్న వ్యక్తి ఆ వెంటనే అదే నెలలో ఇన్నోవేటివ్ ఫార్మా పేరిట బ్రాండెడ్ మందుల షాపు ఏర్పాటు చేశారు. తర్వాత ఆరు నెలల వ్యవధిలోనే బినామీ పేరుతో జన ఔషధి షాపు తెరిచారు.

కీర్తి బ్రాండెడ్ షాపులో నాసిరకం మందులు

బర్డ్ ఆస్పత్రి భవనంలో కీర్తి మెడికల్ స్టోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నడుస్తున్న బ్రాండెడ్ మందుల షాపు వ్యవహారం కూడా వివాదాస్పదంగా ఉంది. ఈ షాపు నెలవారీ అద్దె రూ.18 లక్షలు. స్వల్ప కాలంలోనే ఈ షాపుపై ఫిర్యాదులు రావడంతో స్విమ్స్, బర్డ్ ఉన్నతాధికారులు గత నెల 23న తనిఖీ చేశారు. బ్రాండెడ్ మందులకు బదులు జనరిక్ మందులే ఉండడాన్ని గుర్తించారు.వాటిని తొలగించి 90శాతం మందులు బ్రాండెడ్ మందులు ఉంచాలని ఆదేశించారు.దీనిపై గత 25న బర్డ్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా టీటీడీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

తొలి తనిఖీలో వాస్తవాలుగా తేలిన ఆరోపణలు

ఫిర్యాదులు తరచూ వస్తుండడంతో స్విమ్స్ వైద్యుల బృందం ఈ ఏడాది ఏప్రిల్ 15న ఇన్నోవేటివ్ షాపులో తనిఖీలు చేపట్టారు. బ్రాండెడ్ కేటగిరీకి అనుమతి ఇవ్వగా 80 శాతం జనరిక్ మందులే ఉన్నట్లు గుర్తించారు. హై రిస్క్ మందులు, అత్యవసర మందులను విడివిడిగా నిల్వ చేయడం లేదని గుర్తించారు. గడువు సమీపిస్తున్న మందులను కూడా సాధారణ మందులతో పాటు కలిపే ఉంచుతున్నట్టు గమనించారు. ఈ లోపాలతో పాటు రూమ్ టెంపరేచర్ ప్రోబ్ కూడా పనిచేయడం లేదని వైద్యుల బృందం స్విమ్స్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసింది.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● ఎస్‌డీజీఎం చేతననంద్ సింగ్

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ చేతననంద్ సింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం ఉదయం స్టేషన్ దక్షిణం వైపు జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి, ప్రయాణికుల అవసరాల మేరకు పనులు ఉండేలా చూడాలని ఆదేశించారు. నూతన భవనాల్లో వ్యాపార పరమైన అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, డిప్యూటీ సీఈ వామనరావు, డి.ప్రభాకర్, మాధవరావు పాల్గొన్నారు.



తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల ప్రణాళికలు పరిశీలిస్తున్న ఎస్‌డీజీఎం చేతననంద్ సింగ్

సందడిగా కళాంగిని వేడుక

● ఐఐటీలో ఆర్ట్ వర్క్‌షాప్ విజయవంతం



పెయింటింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఐఐటీ, ఐసర్ విద్యార్థులతో ఆర్టిస్టులు

ఏర్పేడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం ఆర్ట్ వర్క్‌షాప్ సందడిగా సాగింది. ఐఐటీకి చెందిన ఆర్టిస్టా.. ది ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో తలపెట్టిన కళాంగిని వేడుక మొదటి రోజైన శనివారం ఉల్లాసభరితంగా సాగింది. ఐఐటీ, ఐసర్‌లకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తిరుపతికి చెందిన మహిళా ఆర్టిస్టులు రాగిమాను శ్రీదేవి, జి.గాయత్రి, బత్తుల అర్చన, ఎస్.లావణ్య పాల్గొని విద్యార్థులకు పెయింటింగ్‌లో మెలకువలు నేర్పించారు. ఫ్లోరల్, సీనరీ, పాట్ అడోర్మెంట్, పేపర్ డెకార్ తదితర అంశాల్లో సలహాలు, సూచనలు ఇచ్చారు. ఫ్యాకల్టీ అడ్వైజర్ పంచేటి జష్వ, ఆర్ట్ క్లబ్ హెడ్ అర్పా రుబీన్, మెంటార్ రోహన్ రతన్, క్లబ్ సభ్యులు బీఎస్ఎన్ కౌశిక్, రిషికేష్ రెడ్డి, సాత్విక్ పిల్యానం, హర్షవర్ధన్, రూబితా రంగనాథన్, సిద్ధార్థ గుంటూరు, నాగశ్వేత, శ్రీవర్షిని, రుతిక, మేఘ్ మెహతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ వెంకటేశ్వరి సూచించారు. గంగాధరనెల్లూరు ఎస్సీకాలనీ, మోతరంగనపల్లె, కోటాగరం, ఆవలకండిగ ఇందిరానగర్‌కాలనీ అంగన్‌వాడీకేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. బాలగంగనపల్లెలో జరిగిన పోషణ మాసోత్సవాల్లో పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పలు సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పద్మనంద, బాలగంగనపల్లె సర్పంచ్ శేఖర్, తూగుండ్రం పీహెచ్‌సీ డాక్టర్లు ప్రవీణ్, మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనురాధ, సంగీత, మాజీ ఆత్మ చైర్మన్ దేవరాజు, పెనుమూరు ఏఎంసీ డైరెక్టర్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణికి ఆకుకూరను అందజేస్తున్న పీడీ వెంకటేశ్వరి

వరసిద్ధుడి ఆలయ సిబ్బందికి బియ్యం పంపిణీ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అర్చక, వేద పండితులు, ఉద్యోగులు, సిబ్బందికి బియ్యాన్ని శనివారం ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్, మాజీ చైర్మన్ మణినాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏటా ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియగానే సిబ్బందికి బియ్యం పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ప్రసాద్, ధనపాల్, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



సోమశేఖర్‌గురుకుల్‌కు బియ్యం బస్తాను అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్

కబడ్డీ పోటీల్లో వెరిటాస్ ప్రతిభ



పాఠశాలకు చెందిన క్రీడాకారులను, కోచ్‌లను అభినందిస్తున్న చైర్మన్ శేషారెడ్డి

ములుగు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి రజత పతకాన్ని గెలుచుకున్నారని వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి పాఠశాలలో కబడ్డీ క్రీడాకారులను, కోచ్‌లు శంకర్, నరేశ్‌లను ఆయన సన్మానించి, అభినందించారు. బీహార్ రాష్ట్రం రోహతక్‌లోని నారాయణ్ వరల్డ్ స్కూల్‌లో ఈ నెల 13 నుంచి 17వరకు జాతీయ స్థాయి సీబీఎస్ఈ క్లస్టర్స్ అండర్-17 బాలుర కబడ్డీ పోటీలను నిర్వహించగా, తిరుపతి వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు లీగ్ దశ నుంచి ఫైనల్‌కు చేరారు. శ్రీగురు హరికృష్ణన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 45-52 పాయింట్స్‌తో వెనుకబడి రన్నర్స్‌గా నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు కబడ్డీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని సీబీఎస్ఈ పాఠశాలల నుంచి ఇప్పటివరకు ఎవరూ సాధించని జాతీయ స్థాయి పతకాన్ని సాధించారని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి, డీన్ సీజీహెచ్ ఖాన్, ప్రిన్సిపాల్ పీఆర్ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ యస్. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: జడ్పీ సీఈవో

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు సూచించారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొండపాళ్యం ఎస్టీ కాలనీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, ఏవో మోహన మురళి, పంచాయతీ కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు →

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పాలసముద్రం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెంగళరాజుకుప్పం క్రీడా మైదానంలో రెండ్రోజులుగా నిర్వహించిన అండర్-14, 17 క్రీడాపోటీల్లో జిల్లాస్థాయికి క్రీడాకారులను ఎంపికచేశారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో తిరుమలరాజుపురం, బలిజకండ్రిగ బాలబాలికలు ఎంపికైనట్లు ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీహరి, పీఈటీలు కృష్ణయ్య, అన్నరసు, హరి తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే థామస్‌కు కృతజ్ఞతలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎస్టీకాలనీని యానాది సమగ్ర అభివృద్ధి పథకం కింద ఎంపిక చేశారు. దీనిపై శనివారం ఎమ్మెల్యే థామస్‌కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళిని సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



నగరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నత్తం కండ్రిగ ఉన్నత పాఠశాలలో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న అనిత, లక్ష్మీశైలజను సత్కరించారు. శనివారం పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఉమాశంకర్, శ్రీదేవి, టీచర్లు నాదముని, రామరాజు, కె.బాబు, పద్మజ, వీఎల్‌బాబు, మునికుమార్, సమతి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో కొట్టుకెళ్లిన చేప పిల్లలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం వద్ద మత్స్యశాఖ ద్వారా పెంచే చేప పిల్లలు వరద నీటిలో కొట్టుకుని పోయాయని మత్స్యశాఖ అధికారి రామ్మోహన్ శనివారం తెలిపారు. వరద నీటి వల్ల చేప పిల్లల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

12 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. రెండ్రోజులుగా ట్రాఫిక్ పోలీసులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలను నడిపిన 12 మందిపై కేసు నమోదు చేశారు. వీరిని శనివారం కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. ఆమె ఒక్కొక్కరికి రూ.10వేల వంతున రూ.1.20లక్షల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఐసర్‌లో ఎర్లీ కెరీర్ రీసెర్చ్ సింపోజియం

ఏర్పేడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అకడమిక్ సహకారాన్ని బలోపేతం చేయడమేగాక యువ పరిశోధకులకు వేదిక కల్పిస్తామని ఐసర్ ప్రతినిధులు చెప్పారు. ఏర్పేడు మండలంలోని ఐసర్ ఆధ్వర్యంలో తిరుపతి ఐఐటీ, జర్మనీ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్‌తో పాటు బంగ్లాదేశ్, భూటాన్, భారత్, నేపాల్, శ్రీలంకలకు చెందిన డీఏఏడీ రీసెర్చ్ అంబాసిడర్ల నెట్‌వర్క్ సహకారంతో ఎర్లీ కేరీర్ రీసెర్చ్ సింపోజియం నిర్వహించారు. ఇంటిగ్రేటివ్ బయోసైన్సెస్ - డేటా డ్రివన్ డిస్కవరీ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో బయాలజీ డేటా సైన్స్ రంగాల అనుసంధానంపై ప్రసంగాలు, చర్చలు జరిగాయి. వ్యక్తిగత వైద్య పద్ధతులు, వ్యాధి అంచనాలు, శాస్త్రీయ ఆవిష్కరణల్లో డేటా సైన్స్ పాత్రపై ప్రధానంగా దృష్టి పెట్టారు. బయోమెడికల్ ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలపై డాక్టర్ నాగరాజు గణపతి(ఐఐటీ హైదరాబాద్), డాక్టర్ శ్రీయా శ్రీనివాసన్(హార్వర్డ్ యూనివర్శిటీ) వివరించారు. ఔషధ ఆవిష్కరణలు, ట్రాన్స్‌లేషనల్ సైన్స్, మేధో సంపత్తి హక్కులపై డాక్టర్ అంబ్రిస్ సక్సేనా, డాక్టర్ రఘునాథ్, ఓ.రామభద్రన్(తిరుపతి ఐసర్) చర్చించారు. మాలిక్యులర్ బయాలజీ, డేటా మైనింగ్‌పై డాక్టర్ శృతి ఎస్ వెంబర్(ఐబీఏబీ, బెంగళూరు) ఉపన్యసించారు. తిరుపతి ఐసర్ ప్రతినిధి డాక్టర్ వసుధారాణి దేవనాథన్, తిరుపతి ఐఐటీ ప్రతినిధి డాక్టర్ పంచచారం మారియప్పన్, డీఏఏడీ రీసెర్చ్ అంబాసిడర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపోలో, ఎస్వీ, పద్మావతి మహిళా యూనివర్శిటీలు, తిరుపతి ఐఐటీ, ఐసర్ నుంచి వచ్చిన 200మందిపైగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. జర్మనీలో లభించే పరిశోధన అవకాశాలను డీఏఏడీ ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. ఐసర్ రిజిస్ట్రార్ ఇందర్‌ప్రీత్‌సింగ్ క్లోహీ, లెఫ్టినెంట్ కల్నల్ హిమాంశు శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థినులకు సైకిళ్ల వితరణ



యాదమరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న 28మంది బాలికలకు గ్లోబల్ కంపాషన్ ఇ.ఎస్.సి (యు.ఎస్.ఏ) సహకారంతో రెండు లక్షల విలువైన సైకిళ్లను షేర్ జీసస్ వర్డ్ మినిస్ట్రీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎల్.జోసెఫ్ దంపతులు వితరణ చేశారు. దీనికి టీచర్ సి.మహేష్ చొరవ తీసుకున్నారని ప్రిన్సిపాల్ ఎ.పి.లలిత తెలిపారు. వీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంగమ్మగుడి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కె.హేమంత్, కె.విష్ణు(పదో తరగతి), యోగానంద (9వ తరగతి) విద్యార్థులు సెపక్ తక్రా సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని శనివారం పాఠశాలలో అభినందించారు. టీచర్లతో కలిసి హెచ్ఎం కళావతి అభినందించారు.

వాటర్ ప్యూరిఫైయర్ వితరణ



విజయపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌ను పూర్వ విద్యార్థి సుమన్ శనివారం వితరణ చేశారు. హెచ్ఎం వెంకమరాజు, టీచర్ సూరాలక్ష్మి, గ్రామస్తులు సురేష్‌రాజు, నరేష్, జయరామరాజు పాల్గొన్నారు.

ముందస్తు దసరా వేడుకలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం లక్ష్మీనరసింహా హైస్కూల్‌లో శనివారం ముందస్తుగా దసరా వేడుకలను జరుపుకున్నారు. డైరెక్టర్లు వెంకటేష్, దిలీప్‌కుమార్, ధనుంజయరెడ్డి, పురుషోత్తం, హెచ్ఎం హేమలత, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.



● 157 దేశాల నోట్లు

● పదేళ్లలో 200 కోట్లు

శ్రీవారి హుండీలో విదేశీ కరెన్సీ



■ ఆదివారం ప్రత్యేకం

తృణమో పణమో అయినా స్వామికి హుండీలో సమర్పించుకోకుండా తిరుమల కొండకు వచ్చిన భక్తులెవరూ తిరుగు ప్రయాణం కారు. అట్లా శ్రీనివాసుడికి నగదూ, నాణేలూ, ఆభరణాలతో పాటు భూములు, భవనాల పత్రాలు కూడా హుండీ ద్వారా లభిస్తుంటాయి. హుండీ అనేది డబ్బు సేకరణకు సాధనం కాదు. భక్తికి ప్రతీక. దేశదేశాల నుంచి వచ్చే భక్తులు తమ దేశాల కరెన్సీనీ, నాణేలనూ హుండీలో వేస్తుంటారు. ప్రపంచంలో 197 దేశాలుంటే 157 దేశాల కరెన్సీ శ్రీవారి హుండీలో లభించింది. 2015 నుంచి 2025 మార్చి వరకు ఉన్న రికార్డుల ఆధారంగా చూస్తే రూ.201,65,97,829 విదేశీ కాయిన్స్, నోట్లు అందాయి. గడిచిన పదేళ్లలో ఏడాదికి సగటున రూ.20.16 కోట్లు విదేశీ సొమ్ములు స్వామి ఖజానాకు అందుతున్నాయి. విదేశీ కరెన్సీని వేలం ద్వారా మనీ చేంజర్స్‌కి అందజేసి స్వదేశీ కరెన్సీగా టీటీడీ మార్చుకుంటుంది. 2003 వరకు బరువు ప్రాదిపదికన నాణేల విక్రయం జరిగేది. ఆ తర్వాత వాటి విలువ ఆధారంగా మార్పిడి జరుగుతోంది. ఎఫ్‌సీఆర్‌ఏ మార్గదర్శకాల ప్రకారం తిరుమల ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి న్యూఢిల్లీలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో విదేశీ కరెన్సీని, నాణేలనూ జమ చేస్తున్నారు. రెండేళ్ల కిందట టీటీడీ ఎఫ్‌సీఆర్‌ఏ(ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) నిబంధనలను ఉల్లంఘించిందనే వివాదం కూడా నడిచింది. విరాళాలు ఇచ్చే దాతల వివరాలు తెలియజేయడం లేదనే రిపోర్టు ఆధారంగా టీటీడీకి జరిమానా కూడా విధించారు. అయితే హుండీలో సమర్పించే కానుకలు కావడంతో ఈ విరాళాలను 'శ్రీవారికి సమర్పించే కానుకలు'గా పరిగణిస్తూ దాతల వివరాలను తెలియజేయాల్సిన అవసరం లేదంటూ యాక్ట్ నుంచి మినహాయింపు లభించింది.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

● 2007 వరకు కూడా కేవలం 15 నుంచి 30లోపు దేశాలకు సంబంధించిన కరెన్సీ మాత్రమే పరకామణి లెక్కింపులో కనిపించేది. ఆ తర్వాతే ఇతర దేశాలకు సంబంధించి కాయిన్స్‌తో పాటు నోట్లు అధికంగా రావడం మొదలయ్యాయి. 2010 వరకు ఉన్న లెక్కలను పరిశీలిస్తే సింగపూర్, అమెరికా డాలర్లు, యూరో సెంట్లు, బ్రిటిష్ పౌండ్లు, మలేషియా, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా, శ్రీలంక దేశాల నగదు అధికంగా ఉండేవి. ఆ తర్వాత అనేక దేశాలకు సంబంధించిన కరెన్సీ కానుకలుగా రావడం పెరిగిపోయింది. అమెరికా, మలేషియా, సింగపూర్‌తో పాటు యూఏఈ దేశాల కరెన్సీ అధికంగా ఉంటోంది.

● స్వామి హుండీలో పాకిస్తాన్ కరెన్సీ కూడా కనిపిస్తూ ఉంటుంది.

● 2004లో 10 టన్నుల విదేశీ నాణేలను టీటీడీ విక్రయించి దాదాపు రూ.కోటి ఆదాయాన్ని పొందింది. అందులో 80 వేల సింగపూర్ డాలర్లు, 1.6 లక్షల అమెరికన్ డాలర్లు, 3 వేల యూరో సెంట్లు, 35 వేల బ్రిటిష్ పౌండ్లు, 8 లక్షల మలేషియన్ రింగెట్లు, 4 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు, వెయ్యి దక్షిణాఫ్రికా రాండ్లు, 15వేల కెనిడియన్ సెంట్లు, 10 వేల లంకన్ రూపాయలు ఉన్నాయి.

● 2007 డిసెంబరు నెల చివరి వారంలో ఆరు రోజుల్లో దాదాపు 14 దేశాలకు చెందిన కరెన్సీ హుండీలో చేరింది.

● 2016లో హుండీ ద్వారా విదేశీ కరెన్సీ 50.63 కోట్లు లభించింది.

● 2015లో రూ.44.81 కోట్లు ఇతర దేశాల కరెన్సీ లభించింది.

● 2020-21 కరోనా సమయంలోనూ స్వామి హుండీలో రూ.1.92 కోట్లు ఇతర దేశాల నగదు చేరడం విశేషం.

ఏటవాకిలి కార్యదర్శి చేతివాటంపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుంగనూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం ఏటవాకిలి పంచాయతీ కార్యదర్శి మంజుశ్రీ చేతివాటంపై డిప్యూటీ ఎంపీడీవోను విచారణకు ఆదేశించినట్లు శనివారం డీపీవో సుధాకర్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 18న 'ఏటవాకిలి కార్యదర్శి చేతివాటం- స్వామిత్వ సర్వేలో పట్టాలిప్పిస్తానంటూ వసూళ్లు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ విషయంపై విచారించి సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.సోమల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న నారాయణ నూతన ఎంపీడీవోకు బాధ్యతలు అప్పగించి సోమవారం విచారణకు వెళతారన్నారు. అలాగే జడ్పీ సీఈవో రవికుమార్ విచారణ చేపట్టాలని పుంగనూరు ఎంపీడీవో అప్పాజీని ఆదేశించగా ఇద్దరు అధికారులు ఏటవాకిలిలో విచారణ చేపట్టనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

కారు ఢీకొని విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



మృతిచెందిన దయానందం

గంగవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంగవరం బెంగళూరు-చెన్నై హైవేలో శనివారం రాత్రి ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... గంగవరం మండల కేంద్రంలోని సాయినగర్ నాగులరాళ్లవీధిలో కాపురముంటున్న దయానందం (66) సొంత పనిపై ద్విచక్ర వాహనంపై వెళ్తూ నడింపల్లె పెట్రోల్‌బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా.. బెంగళూరు నుంచి తిరుమల వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో దయానందానికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

బాలిరెడ్డిగారిపల్లిలో ఏనుగుల విధ్వంసం

● మూడు గ్రూపులుగా 16 ఏనుగుల గుంపు



అడవిలో సంచరిస్తున్న ఏనుగు

కల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం రాత్రి మూడు గ్రూపులుగా విడిపోయిన 16 ఏనుగుల గుంపు వివిధ ప్రాంతాల్లో పంటలపై విధ్వంసం సృష్టించాయి. దీంతో వరి, వేరుశనగ, మామిడి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ఇటీవల ఏనుగుల దాడులు నుంచి పంటలను కాపాడేందుకు కల్లూరు సమీపంలో అటవీశాఖ ఏర్పాటుచేసిన సోలార్ రిఫ్లెక్టర్ లైట్‌ను ఏనుగులు విరిచేశాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన 5 ఏనుగుల గుంపు కమ్మపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి సమీపానికి చేరుకున్నాయి. వరి, వేరుశనగ,మామిడి, జొన్న పంటలను ధ్వంసం చేశాయి.మరో 6 ఏనుగుల గుంపు సైదల్లాగుట్ట సమీపంలోని బోదబండ ప్రాంతం నుంచి బయలుదేరి చిత్తూరు-కర్నూలు హైవే రోడ్డు సమీపానికి చేరుకున్నాయి. బీఎంసీ గోడౌన్ సమీపంలో ఏర్పాటు చేసిన సోలార్ రిఫ్లెక్టర్ లైట్‌ను విరిచేసిన ఏనుగులు పాళెం పంచాయతీలోకి చేరుకున్నాయి. కోటపల్లిలో మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఏనుగులు తిరిగి సైదుల్లా గుట్ట సమీపంలోని అడవిలోకి వెళ్లిపోయాయి. చింతలవంక నుంచి బయలేదేరిన 5 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ కుమ్మరపల్లి వద్దకు చేరుకున్నాయి. అక్కడి నుంచి పలువురు రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ దేవళంపేట, దిగుమూర్తివారిపల్లి మీదుగా తూర్పు విభాగం అడవిలోని సూరప్పచెరువు వద్దకు చేరుకున్నాయి. తూర్పు విభాగం అటవీప్రాంతం సైదుల్లా గుట్ట సమీపంలోని బోదబండ వద్ద శనివారం ఉదయం సంచరిస్తున్న ఏనుగుల గుంపును అటవీశాఖ సిబ్బంది గుర్తించారు.

ఎన్టీఆర్ జలాశయం నుంచి నీటి విడుదల

పెనుమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం నుంచి శనివారం రెండు గేట్ల ద్వారా దిగువకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని ఇరిగేషన్ ఏఈ భరత్ తెలిపారు. ఎగువ ప్రాంతాలైన పూతలపట్టు, పాకాల, దామలచెరువులో కురిసిన వర్షానికి జలాశయంలోకి భారీగా నీరు చేరింది. అయితే రెండు గేట్ల తెరవగానే వాహనాలను అధికారులు బ్రిడ్జిపైకి మళ్లించారు. అయితే రోడ్డుపై కొద్ది ప్రాంతంలో నీరు భారీగా ప్రవహించడంతో వాహనాలను ఆపేశారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో మూడు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ జేఏసీ నాయకులు రెండో రోజైన శనివారం కూడా ఎస్‌ఈ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. జేఎల్‌ఎం గ్రేడ్-2 సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ జేఎల్‌ఎంగా పరిగణించి ప్రయోజనాలు కల్పించాలన్నారు. జేఏసీ నాయకులు మురళీకృష్ణ, యజ్ఞేశ్వరరావు, వివేకానందరెడ్డి, చంద్రమౌళి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు ప్రచార రథం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని డీఎంహెచ్‌వో సుధారాణి ప్రారంభించారు. శనివారం తన కార్యాలయ ఆవరణలో ఈ వాహనాన్ని ఆమె ప్రారంభించి, ప్రసంగించారు. ఈ వాహనం ద్వారా హెచ్‌ఐవీ ఎలా సోకుతుందనే వీడియోలను 15 రోజులపాటు చిత్తూరు, నగరి, కుప్పం, పలమనేరుల్లో ప్రసారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు, అధికారులు జార్జి, జయరాముడు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో పాముకాటు మందు అందుబాటులో ఉంచండి : డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో పాము కాటు మందు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. తన కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ పాము కాటు దినాన్ని నిర్వహించారు. ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల వద్ద పాము కాటు వేస్తే ఎలా రక్షించుకోవాలో తెలిపే పోస్టర్లను అతికించాలని చెప్పారు. టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్, డాక్టర్లు అనిల్, అనూష, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం ఎంపీపీగా మంజు బాలాజి



విజయపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయపురం ఎంపీపీగా మంజు బాలాజీ నియమితులయ్యారు. ఎంపీపీ జమున ఈ నెల 15న ఆరోగ్య సమస్యల వలన ఎంపీపీ పదవికి రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీగా ఉన్న మంజు బాలాజీని ఎంపీపీగా నియమిస్తూ ఉత్తర్వులందాయి.

దసరా సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రేపటినుంచి అక్టోబరు రెండో తేదీవరకు దసరా సెలవులను జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఖచ్చితంగా పాటించాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు.సెలవు దినాల్లో పాఠశాలలు పనిచేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, క్రిస్టియన్ యాజమాన్య పాఠశాలలు అకడమిక్ క్యాలెండర్‌ను అనుసరించి ఈనెల 27 నుంచి అక్టోబరు రెండో తేదీవరకు దసరా సెలవులు ఉంటాయని, అక్టోబరు మూడు నుంచి అన్ని యాజమాన్య పాఠశాలలు పునఃప్రారంభం కానున్నట్లు డీఈవో తెలిపారు.

రహదారిలో గుంతలపై టీచర్ల నిరసన



పెద్దపంజాణి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రహదారిపై గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించాలని పెద్దపంజాణి మండల ఉపాధ్యాయులు శనివారం కత్తార్లపల్లె వద్ద రోడ్డుపై గుంతలను చూపుతూ నిరసన తెలిపారు. పుంగనూరు నుంచి కత్తార్లపల్లె వరకు రోడ్డు గుంతలమయమై ప్రమాదకరంగా ఉందని ఆరోపించారు. పుంగనూరు నుంచి నిత్యం ఈ మార్గంలో దాదాపు 20 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ప్రయాణాలు చేస్తున్నారని.. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. రహదారిపై గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించామని అప్పినపల్లె ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఆదివారం, మంగళవారాలలో బోయకొండకు వెళ్లే భక్తులు అధికంగా ఉంటారని పేర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాలని కోరారు.

గిరిజన పిల్లలు విద్యావంతులు కావాలి : కలెక్టర్



అనుపు ఎస్టీ కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గుడిపాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన పిల్లలు విద్యావంతులు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్షించారు. శనివారం గుడిపాల మండలంలోని అనుపు ఎస్టీ కాలనీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తమకు పక్కా ఇళ్లు లేవని, శ్మశానానికి దారి లేదని.. తమిళనాడు నుంచి వలస వచ్చిన వారికి ఆధార్‌కార్డుల్లేవని తదితర సమస్యలను కలెక్టర్‌కు కాలనీవాసులు తెలియజేశారు. బుజ్జి అనే మహిళ గుండె జబ్బుతో బాధ పడుతోందని, మందులు కొనుగోలు చేయలేని స్థితిలో ఉందని చెప్పగా, ఏడు నెలలకు అవసరమైన మందుల కోసం కలెక్టర్ తన సొంత నిధులు రూ.15వేలను అందిస్తానన్నారు. మిగిలిన సమస్యలను మూడు వారాల్లో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హైవే అధికారులపై శనివారం తెలుగు యువత మాజీ మండల అధ్యక్షుడు శంకర్‌చౌదరి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్లు పనులు నత్తనడకన చేయడమే కాకుండా, పనుల నిర్వహించే ప్రదేశంలో సూచిక బోర్డులు పెట్టక పోవడంతో ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. దీనిపై హైవే అధికారులను ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వడం లేదని వివరించారు.

రెండు ప్రాంతాల్లో ఓటు హక్కున్నా ప్రస్తుతం తొలగించం

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తికి రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు ఉన్నా.. వాటిని ప్రస్తుతం తొలగించడం లేదని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ తెలిపారు.తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీపై శనివారం ఉదయం గంగాధరనెల్లూరులో తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన వివిధ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ, వైసీపీ నేతలు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఓ కుటుంబంలో ఆరుగురు ఓటర్లుంటే స్థానికంగా తల్లిదండ్రులు తప్ప మిగిలిన నలుగురు వారి జీవనార్థం ఇతర రాష్ట్రాల్లో ఉంటారన్నారు. ఆ సమయంలో బీఎల్వోలు తనిఖీలకు వచ్చి.. ఆనలుగురినీ ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తే ఏం చేయాలని ప్రశ్నించారు. దీనిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తహసీల్దారు మాట్లాడుతూ.. కుటుంబంలో ఎవరైన స్థానికంగా ఉన్నపుడు అలాంటి కుటుంబానికి చెందిన ఓటర్లను తొలగించబోమని, అపోహలు అవసరం లేదన్నారు. గ్రామాల్లో ఏ ఓటునైనా తొలగించాలని ఫిర్యాదు వస్తే సంబంధిత ఓటరుకు నోటీసు జారీ చేసి, వివరణ తీసుకున్నాకే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైద్య కళాశాలల్లో పోస్టుల భర్తీ తుది జాబితా విడుదల

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి ఎస్వీ వైద్య కళాశాల, రుయాస్పత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, రుయాస్పత్రిలోని స్కూల్ ఆఫ్ నర్సింగ్, శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల పరిధిలో పోస్టుల భర్తీకి సంబంధించి గతంలో విడుదల చేసిన కంబైన్డ్ నోటిఫికేషన్ తుది జాబితాను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలని తెలిపారు.

స్విమ్స్‌లో అల్లైడ్ హెల్త్‌సైన్సెస్ కోర్సుల మూడో విడత కౌన్సెలింగ్

స్విమ్స్ పరిధిలోని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, బీఎస్సీ అల్లైడ్ హెల్త్‌సైన్సెస్ కోర్సులకు సంబంధించి మిగిలిన సీట్లకు చివరిసారిగా మూడో విడత ఆఫ్‌లైన్ విధానం ద్వారా ఈ నెల 26న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని వెల్లడించారు. ఈ సీట్లను ఏపీ ఎంసెట్-2025 ర్యాంకుల ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు లోబడి భర్తీ చేస్తారని వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26న ఉదయం 8.30 గంటలకు కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

ఆకట్టుకున్న స్టాంపుల ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు ఒక దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వం, సాంకేతిక అభివృద్ధిని ప్రతిబింబించే మౌన సాక్ష్యాలని అపోలో యూనివర్సిటీ వీసీ వినోద్ భట్ అన్నారు. శనివారం అపోలో యూనివర్సిటీలో స్టాంపుల ప్రదర్శనను పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. సుమారు 60 ఫ్రేముల అరుదైన స్టాంపులు, చారిత్రక లేఖల కవర్లు, పోస్టల్ ఎన్వలప్స్ ప్రదర్శనలో ఉంచారు. ప్రొఫెసర్లు కిరణ్, నిశాంత్ భట్, రాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్,పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మకత జోడింపుతో రాణింపు



ఇంజనీరింగ్ పట్టా పొందిన విద్యార్థులతో వీసీ, బీసీఎన్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మకత జోడిస్తేనే విద్య చక్కగా రాణిస్తుందని అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. కుప్పం ఇంజనీరింగు కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ సముపార్జించిన జ్ఞానాన్ని సమాజ సేవకు వినియోగించాలన్నారు. ఇంజనీరింగ్ పట్టా పొందడం ఒక ఆరంభం మాత్రమేనన్నారు. కృషి, పట్టుదల, చిత్తశుద్ధితో కూడిన సృజనాత్మకత ఆ విద్యకు మన్నిక తెస్తుందని చెప్పారు. బీసీఎన్ విద్యా సంస్థలు, కేఈసీ వ్యవస్థాపక ఛైర్మన్ బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను తాము విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్, సెక్రటరీ ఎన్.సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ అండ్ ఈసీఈ హెచ్‌వోడీ జీఎన్.కోదండరామయ్య, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కుప్పం గురుకుల పాఠశాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సరోజ

కుప్పం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం మహాత్మ జ్యోతిబాపూలే ప్రభుత్వ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో అథ్లెటిక్స్‌లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కె.సరోజ తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీలలో నెగ్గినట్లు చెప్పారు. అండర్ 14, 16, పరుగు పందేల్లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్ల పోటీలలో నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానం గెలుచుకున్నారన్నారు. అలాగే వాలీబాల్, కబడ్డీ, చెస్ అండర్-14 పోటీల్లో ప్రథమ, అండర్-17 పోటీల్లో ద్వితీయ స్థానాలు సాధించినట్లు చెప్పారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

51 మందికి కంటి పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రామకుప్పం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం పీఈఎస్ వైద్యకళాశాల ఆస్పత్రి, రామకుప్పం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రామకుప్పంలో నిర్వహించిన ఎన్టీఆర్ వైద్యసేవ ఉచిత కంటి చికిత్స శిబిరంలో 51 మంది రోగులకు చికిత్సలందించారు. 10 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి, వైద్యులు షేక్‌సల్మాబేగం, మహాశ్రీ, జయస్నేహ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు టీడీపీ ఆసరా



రెడ్డెప్ప కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం, దుస్తులు అందజేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బందార్లపల్లె పంచాయతీ యానాదికాలనీకి చెందిన రెడ్డెప్ప కుమారుడు, శ్రీనివాసులు కుమార్తెకు గురువారం పెళ్లి జరగనుంది. దీంతో శనివారం టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి స్థానిక నేతలతో కలిసి వధూవరులకు దుస్తులు, పసుపు, కుంకుమ, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, రెస్కో డైరెక్టర్ సతీష్, నేతలు రాణెమ్మ, మంజునాథ్, మురళీమోహన్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రామకుప్పం విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఎస్ఎంసీ ఛైర్మన్, హెచ్ఎం

రామకుప్పం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో రామకుప్పం బాలికోన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. అండర్-17 విభాగంలో వాలీబాల్ విభాగంలో శిరీష, అండర్-14 విభాగంలో నందిని, బాడ్మింటన్ విభాగంలో ప్రణతి, అండర్-17 విభాగం ఖోఖో, కబడ్డీలో మేఘన, బాడ్మింటన్‌లో వైష్ణవి, చదరంగంలో శ్రావణి, 800 మీటర్ల పరుగుపందెంలో వైశాలి, 1500 మీటర్ల పరుగుపందెంలో పల్లవి, లాంగ్‌జంప్‌లో ఝాన్సీరాణి, హైజంప్‌లో సానకౌసర్, శ్రావణిలు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు భగవద్గీత తెలిపారు. ఆమెతోపాటు ఎస్ఎంసీ ఛైర్మన్ కేశవరెడ్డి పీడీ హేమలతను, విద్యార్థులను అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఈ ప్రసన్నకుమార్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు చిత్తూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం పుంగనూరు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వసతిగృహాలను పరిశీలించి అవసరమైన చోట మరమ్మతు పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వస్తే వెంటనే చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆయన వెంట డీఈఈ సురేశ్‌రెడ్డి, జెఈ చందన తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన



పలమనేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శనివారం దస్తావేజు లేఖరులు నిరసన తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తీసుకొచ్చిన ఓటీపీ విధానం రద్దుచేసి పాత విధానాన్నే అమలు చేయాలని డిమాండు చేశారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

23 నుంచి బోయకొండ గంగమ్మ దసరా మహోత్సవాలు

చౌడేపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 23 నుంచి దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. ఈనెల 23న బాలాత్రిపుర సుందరీదేవి, 24న పార్వతీ దేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న ధనలక్ష్మీదేవి, 27 న శాకాంబరీ దేవి, 28న మహాచండీ దేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసురమర్ధిని, 2న రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. 20పిజిఆర్ఎస్‌డిఎం02: స్టాల్స్‌లోని చిరుధాన్యాలను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవి

సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

సదుం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యమని ఐసీడీఎస్ పులిచెర్ల ప్రాజెక్టు సీడీపీవో వాణిశ్రీదేవి పేర్కొన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం సదుం సచివాలయంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యులు చరణ్, ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు, నాయకులు

రామకుప్పం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో మారు మూల గ్రామా ల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభు త్వం ప్రాధాన్యత ఇస్తోందని టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా అధికారులు రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గడ్డూరు గ్రామంలో శిబిరం నిర్వహించి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, స్థానికులకు అవసరమైన ధ్రువపత్రాలు, వారికి అందాల్సిన సంక్షేమ పథకాల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, రెస్కో డైరెక్టరు సతీష్, వీఆర్వో హరినాథ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె కనిపించలేదని తల్లి ఫిర్యాదు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె రెండు రోజులుగా కనిపించలేదని తల్లి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు పుంగనూరు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు... మండలంలోని ఏటవాకిలి పంచాయతీ ప్రసన్నగారిపల్లెకు చెందిన లక్ష్మీదేవి కుమార్తె నీరజ(19) కనిపించలేదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లలందరికీ ఆధార్‌కార్డులు



సూచనలిస్తున్న సీడీపీవో ఉమారాణి

పలమనేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ పిల్లలందరికీ తప్పనిసరిగా ఆధార్‌కార్డులు తీసుకోవాలని పలమనేరు సీడీపీవో ఉమారాణి సూచించారు. శనివారం మండలంలోని మండిపేట, చెత్తపెంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలకు పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈశ్వరి, మీనాక్షి, పుష్పవేణి, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల వితరణ



పలమనేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం దొడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు ఉమ, భూదేవి, యువరాజులు క్రీడాదుస్తులు, గుర్తింపు కార్డులను విద్యార్థులకు వితరణగా అందజేశారు. నేతాజీ ఉపాధ్యాయులను అభినందించారు.

చెన్నపట్నం చెరువుకు జలకళ

● కల్వర్టుకు పడిన గండి ● ఎస్టీ కాలనీకి స్తంభించిన రాకపోకలు



గండిపడిన ఎస్టీ కాలనీ మార్గాన్ని పరిశీలిస్తున్న అధికారులు



మొరవపోతున్న చెన్నపట్నం చెరువు

సోమల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తిరుపతి - పుంగనూరు మార్గంలోని చెన్నపట్నం చెరువు శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి మొరవ పారుతోంది. ఈక్రమంలోనే మొరవ వేగంతో ఎస్టీకాలనీ, మధురమలై కొండ మార్గంలో తాత్కాలికంగా నిర్మించిన మట్టి కల్వర్టుకు గండి పడింది. మొరవ వేగంతో నీరు దిగువకు తరలిరావడంతో ఎస్టీ కాలనీ వైపు రాకపోకలు స్తంభించాయి. ఈక్రమంలోనే ఆ మార్గాన్ని సందర్శించిన తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీవో నారాయణ, ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు నీటిసంఘ అధ్యక్షుడు గల్లా బోస్ జిల్లా అధికారులకు సమాచారం అందించారు. అలాగే చెరువుమిట్ట మొరవ వేగంగా పారడంతో దిగువన ఉన్న పంట పొలాల్లో నీరు ప్రవహిస్తోంది. చౌడేపల్లె మండలంలోనూ భారీ వర్షం కురవడంతో అక్కడి నీరు చెన్నపట్నం చెరువుకు వేగంగా వచ్చి చెరువుకు జలకళ సంతరించుకుంది. చెరువు మొరవతో దిగువన ఉన్న పలు చెరువులు, కుంటలు నిండాయి. మొరవనీరు వేగం పెరిగితే నంజంపేట - సోమల మార్గంలోని జీడిరేవుల వంకపై ప్రభావం చూపి అక్కడ తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. తిరుపతి - పుంగనూరు మార్గంలోని ప్రధాన రోడ్డు పక్కనే చెరువు ఉండటంతో ప్రజలు భారీగా సందర్శిస్తున్నారు.

ఇరిగేషన్ అధికారుల తీరుపై ఆగ్రహం

రెండు రోజుల్లో చెరువు మొరవ పోతుందని, ఎస్టీ కాలనీ మార్గంలోని కల్వర్టు పరిస్థితిని అంచనా వేసిన స్థానిక నీటి చెరువు సంఘ అధ్యక్షుడు గల్లా బోస్ ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటికీ అధికారులు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కల్వర్టు గండి పడటంతో అటు వైపు ఎస్టీ కాలనీ వాసులు, రైతులు వెళ్లడానికి మరో మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మోనా

కల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని సింగిల్ విండో అధ్యక్షులు ధనంజయ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం 102 రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ కేంద్రంలో పులిచెర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు, నజీర్, రమేష్, పంచాయతీ కార్యదర్శి నాగరాజ, వైద్య సిబ్బంది శ్రీదేవి, చంద్రయ్య, ప్రమీల పాల్గొన్నారు.

● **సోమల:** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబానికి రక్షణ అని ఎంపీడీవో నారాయణ, ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. శనివారం ఇరికిపెంటలో ఆరోగ్యకేంద్రంలో పూజలు జరిపి ఉచిత వైద్యశిబిరాన్ని అధికారులు ప్రారంభించారు. అలాగే జాతీయ పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరి, వైద్యాధికారులు డాక్టర్ జయసింహ, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సీహెచ్‌వో అమరనాథ్, నీటిసంఘ అధ్యక్షుడు గల్లా బోస్, భాస్కర్‌నాయుడు, కొల్లా కోటీశ్వరరావు, సతీశ్, చంద్రశేఖర్ నాయుడు, కార్యదర్శి మేనక, సూపర్‌వైజర్ హరిత పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** మాతా శిశు మరణాలు నివారించడమే లక్ష్యమని డాక్టర్ మోనా పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఏకొత్తకోట అంగన్‌వాడీ కేంద్రంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరీదేవి, సూపర్‌వైజర్లు సులోచన, రాధా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజుపల్లెలో వైద్యపరీక్షలు

పెద్దపంజాణి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపల్లెలో శనివారం ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు, చర్మ వ్యాధులపై అవగాహన కల్పించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మురళీ, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు భాను ప్రతాప్ రెడ్డి, నాగరాజ, చందు, బాలకృష్ణారెడ్డి, ప్రవీణకుమార్ తదితరులు ఉన్నారు.

సదుం ఎంపీడీవోగా రాధారాణి



సదుం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సదుం నూతన ఎంపీడీవోగా రాధారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా కేవీబీపురం ఏవోగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై ఎంపీడీవోగా సదుంకు బదిలీపై వచ్చారు. శనివారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

పెద్దపంజాణి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపేట సచివాలయాన్ని శనివారం ఎంపీడీవో బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెండిగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

రహ్మత్ నగర్‌లో చెత్తకుండీలు ఏర్పాటు చేయాలి

పుంగనూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు రహ్మత్ నగర్‌లో ప్రజలు చెత్తను వేయడానికి చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని ఎస్డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రహమత్‌నగర్‌లోని వీధుల్లో చెత్త వేయడంతో దోమలు పెరిగి దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దోమల తో జ్వరాలు సోకి పిల్లలు ఆస్పత్రి పాలవుతున్నారన్నారు. కొత్త చెత్తకుండీల ఏర్పాటు చేయడంతో చెత్తను అందులో వేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు.

టీడీపీ బ్యానర్లు తొలగించారని ఫిర్యాదు



టీడీపీ బ్యానర్లు తొలగించారని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

గంగవరం, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన టీడీపీ నాయకుల బ్యానర్లను వైసీపీ నాయకులు రాత్రికి రాత్రే తొలగించారని టీడీపీ నాయకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు టీడీపీ నాయకులు మురళీ, హరిబాబు, యుగంధర్ , బాలాజీ, ఎస్సీసెల్ రవి, ఆనంద, రఘు, అశోక్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలి



ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలంటూ ర్యాలీ

పుంగనూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించినప్పుడే మనిషి ఆరోగ్యంగా జీవించగలరని పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రజలతో కలిసి మున్సిపల్ సిబ్బంది ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు సీవీరెడ్డి, సుహేల్‌బాషా, మహిళా సంఘసభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతిఒక్కరి మౌలిక బాధ్యత



కుప్పంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మొక్కలు నాటుతున్న పీఎస్ఎం తదితరులు



కుప్పం అన్న క్యాంటీన్ వద్ద మొక్కలు నాటుతున్న జాకీర్ తదితరులు



పెద్దపంజాణి : చెత్తసేకరణ తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బాలాజీ



పలమనేరు వారపు సంతలో చెత్తాచెదారం తొలగింపును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కుప్పం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత అనేది ప్రతి పౌరుడి మౌలిక బాధ్యత అని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పీఎస్ఎం మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛత, పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలన్నారు. విద్యార్థులు పరిశుభ్రతపై గ్రామాలలో అవగాహన కలిగించాలని కోరారు. కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఆవరణ, పరిసరాల్లో మొక్కలు నాటారు. మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు, మాజీ జడ్పీటీసీ రాజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్నాథరావు, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరును కాలుష్య రహిత పట్టణంగా మార్చి గ్రీన్ పలమనేరుగా చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడో శనివారం మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారపు సంతలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, డీఎస్పీ డేగల ప్రభాకర్, ఎస్.ఐ లోకేష్‌రెడ్డి, మెప్మా సీఎంఎం వి.బాబా, నాగమణి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు శ్రీపురం సీతారామయ్య, విశ్రాంత సైనికులు సిద్దయ్య, పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● **పెద్దపంజాణి:** పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో బాలాజీ సూచించారు. శనివారం మండలంలోని కోగిలేరు పంచాయతీలో పర్యటించారు. పారిశుధ్య కార్మికుల చెత్తసేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్పంచ్ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, వీఆర్వో శివకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ యానాది కాలనీ కడపల్లెలో శనివారం మండల స్థాయి అధికారులందరూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దారు హనుమంతు, ఏపీవో మురుగేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో స్వచ్ఛ కుప్పం సాకారం

● **కుప్పం:** మొక్కల పెంపకంతో స్వచ్ఛ కుప్పం సాకారమవుతుందని మున్సిపల్ కౌన్సిలర్ జిమ్‌దాము, టీడీపీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వారు కుప్పం పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాక, మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కిరణ్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **వి.కోట:** స్వచ్ఛాంధ్రకు ప్రతిఒక్కరూ సహకరించాలని రాష్ట్ర వేర్‌హౌస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రంగనాథ్ అన్నారు. శనివారం వి.కోట మండల సచివాలయ ఆవరణలోని సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, మండల పార్టీ కార్యదర్శి ఈశ్వర్, తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, శబరీష్, సర్పంచ్ పీఎన్ లక్ష్మీ, పీఏసీఎస్ ఛైర్మన్ నారాయణ స్వామి, ఏపీవో గౌరీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండండి: మేయర్


మొక్క నాటి నీరు పోస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని మేయర్ అముద సూచించారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఏపీ కార్యక్రమాన్ని వన్నియర్ బ్లాక్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ప్రజలు, సిబ్బంది సమష్టి బాధ్యతతోనే మెరుగైన పారిశుధ్య నిర్వహణ సాధ్యమవుతుందని మేయర్ అన్నారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్, స్థానిక కార్పొరేటర్ శశితో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన 1.40 వేల టన్నుల వ్యర్థాలను తొలగించి అక్కడ పచ్చదనాన్ని పెంచుతున్నట్లు చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం యుగంధి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మహిళా సంఘా సభ్యులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయాన్ని శుభ్రంగా ఉంచుకుందాం


మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయం వద్ద మొక్కలు నాటారు. నాయకులు మణినాయుడు, గిరిధర్‌బాబు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సమాజానికి ఇచ్చే బహుమతి 'స్వచ్ఛత': ఎస్పీ


మొక్క నాటుతున్న ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత అనేది మన బాధ్యత మాత్రమే కాదు.. సమాజానికి ఇచ్చే బహుమతి అని ఎస్పీ తుషార్ డూడి చెప్పారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన మొక్కను నాటారు. అనంతరం అధికారులు, సిబ్బందితోనూ మొక్కలు నాటించి, ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎస్పీ ఆదేశాలతో అన్ని పోలీసు స్టేషన్లలోనూ స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాపోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష పాల్గొన్నారు.

శుభ్రతను పాటిద్దాం: కమిషనర్


నగరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, కార్మికులు

నగరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శుభ్రతను పాటిద్దామని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంతమైదానంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. సత్రవాడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తర్వాత మున్సిపల్ కార్యాలయం నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించి, స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

రెండు నుంచి ప్లాస్టిక్ వాడకంపై నిషేధం: అక్టోబరు రెండో తేదీనుంచి ప్లాస్టిక్ వాడకాన్ని పట్టణ పరిధిలో పూర్తిగా నిషేధిస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. మెప్మా పీడీ డాక్టర్ రవీంద్ర, పురపాలక సంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయశంకర్, మెప్మా సీఎంఎం ప్రసాద్, సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కరియ మాణిక్య స్వామికి ఊంజల్ సేవ



నగరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెరటాసి నెల తొలి శనివారాన్ని పురస్కరించుకుని నగరిలోని భూదేవి, శ్రీదేవి సమేత కరియమాణిక్య స్వామి, సత్రవాడ శ్రీభూనీలా సమేత కరివరదరాజ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కరియమాణిక్య స్వామికి సాయంత్రం ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. కరివరదరాజ స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

'అంగీకార్' బ్రోచర్ ఆవిష్కరణ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పీఎం ఏవై అర్బన్ 2.0 (అంగీకార్) బ్రోచర్‌ను మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు. శనివారం నగరపాలక కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి, టిడ్కో ప్రతినిధి ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

● భక్తిశ్రద్ధలతో పెరటాసి నెల తొలి శనివారం పూజలు


వేంకటేశ్వరాలయంలో భక్తుల సందడి

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు పెరటాసి నెల తొలి శనివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి, గోదాదేవి, ఆంజనేయ సమేత వేంకటేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. అలాగే శ్రీకృష్ణాలయం, కోదండరామాలయంతో పాటు రాజుగుడి, వీరాంజనేయ స్వామి, కట్టమంచి వరదరాజ, గిరింపేట సీబీరోడ్ ఆంజనేయ, సంతపేట విజయలక్ష్మికాలనీ శ్రీరంగనాథ ఆలయాల్లోనూ భక్తుల సందడి కనిపించింది.

కలిగిరికొండపై భక్తుల సందడి

పెనుమూరు: మండలంలోని కలిగిరికి కొండపై ఉన్న వెంకటేశ్వర ఆలయంలోనూ పెరటాసి నెల మొదటి శనివారం కావడంతో భక్తుల సందడి నెలకొంది. భక్తులకు వాసుదేవాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


విద్యుద్దీపాలంకరణలో దుర్గాంబ ఆలయం (ఇన్‌సెట్లో) ఆకట్టుకున్న ఆర్చి

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలోని దుర్గాంబ ఆలయంలో సోమవారం నుంచి జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం, ఉత్సవం మంటపం వద్ద చలువ పందిళ్లు, విద్యుద్దీప అలంకరణలు చేశారు. గిరింపేట మెయిన్ రోడ్డులో విద్యుద్దీపాలతో పెట్టిన నాలుగు ఆర్చిలు ఆకట్టుకున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

షికారి కాలనీలో మొక్కలు నాటిన డీపీవో



యాదమరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కీనాటంపల్లె పంచాయతీలోని షికారికాలనీలో డీపీవో సుధాకరరావు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కాలనీలో మౌలిక వసతులపై ఆరా తీశారు. డిప్యూటీ ఎంపీడీవో రామచంద్ర, తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు, కార్యదర్శి దివ్య తదితరులు పాల్గొన్నారు.

కాలువకు స్థలాన్ని పరిశీలించిన అధికారులు


పి.కొత్తకోటలో పరిశీలిస్తున్న అధికారులు

పూతలపట్టు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోటలో కాలువల్లేక పడుతున్న ఇబ్బందులను శుక్రవారం గ్రామానికి వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. స్పందించిన ఆయన వెంటనే కాలువల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తనకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నందకుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ వెన్నెల, సచివాలయ సిబ్బంది శనివారం కొత్తకోటకు వచ్చి, పరిశీలించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నారు.

పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

పూతలపట్టు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తేనేపల్లె పంచాయతీ సచివాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కిట్లు అందజేశారు. ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు గుంటూరు మురళి, బుల్లెట్ నరేష్ రెడ్డి, సర్పంచ్ రాధ, వైస్ సర్పంచ్ నందయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'చవితి' వేడుకలు



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రంలో వినాయక చవితి వేడుకలు శనివారంతో ముగిశాయి. శనివారం సాయంత్రం గ్రామస్తులు, యువత కలిసి గణేశుడి విగ్రహాన్ని ఊరేగించి, సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

కోలా ఆనంద్‌కు శుభాకాంక్షలు



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన కోలా ఆనంద్‌కు చిత్తూరు జిల్లా బలిజ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం ఆయన నివాసంలో కలిసి గిరింపేట దుర్గాంబ ఆలయ ప్రసాదాలను అందజేసి, శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. నాయకులు వీకే విశ్వనాథ్, ఆరణి తులసీరాం, దేవేంద్రసిద్ధా పాల్గొన్నారు.

నిండుకుండలా నుంజర్ల ప్రాజెక్టు


నుంజర్ల ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

యాదమరి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొరవ పారి నిండుకుండలా ఉన్న భూమిరెడ్డిపల్లిలోని నుంజర్ల ప్రాజెక్టును శనివారం అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో కార్యాలయ ఏవో వేణు, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు సందర్శించారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీవా నది ప్రవాహానికి దగ్గరగా ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

ఘనంగా టీడీపీ నేత జన్మదిన వేడుకలు



తవణంపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి జన్మదిన వేడుకలు శనివారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆధ్వర్యంలో తవణంపల్లె టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో కలిసి వెంకటేష్ చౌదరి కేక్‌కట్ చేశారు. బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, నాయకులు గాలి దిలీప్, అమరేంద్రనాయుడు, సునీల్ చౌదరి, బాబు నాయుడు, సతీష్, ప్రవీణ్, గిరి నాయుడు, మధు, గోపి, ధనంజయనాయుడు, కుమార్ నాయుడు, వినాయకం, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.